మినీ కథ

# పెళ్ళాం మాట

ఎస్. అగ్బల్

"ఏమండీ, వాడి విషయం మీకు పట్టనట్టే వుంటారేం?" చాటలో బియ్యం యేరుతున్న శాంత గొంతులో విషాదం వినిపించింది.

రామ్మూర్తిలో ఏ మాత్రం చలనం కన్పించలేదు. యథావిధంగా పేపర్ చదువుతూ కూర్చున్నాడు.

"పాతికేళ్లు కళ్ళలో పెట్టుకు పెంచి పెద్ద చేసిన అమ్మా నాన్నా పోయారు. నిన్నకాక మొన్న వచ్చిన పెళ్ళాం ఎక్కువయిపోయింది!" శాంత చెమ్మగిల్లిన కళ్ళు చీర కొంగుతో తుడుచుకుంది.

"శాంతా!" రామ్మూర్తి మాట వినగానే శాంత ముఖంలో వెలుగు కన్పించింది.

"ఎన్. టి. ఆర్‌తో మంచి సినిమా తీస్తున్నారు...."ఇంకా యేదో చెప్పబోతుండగానే శాంత సీరసంగ పక్కకు తప్పుకొంది. వంట గదిలో భూకంపం వచ్చినట్టు పాత్రలన్నీ క్రింద పడ్డాయి.

"చూశారు కదా, దాని పొగరు!" శాంత రామ్మూర్తికి విన్నవించుకుంది.

"పొగరంటారేమిటి చెయ్యి జారింది!" లోపలినుంచి కోడలు గొంతు వినిపించింది.

గేటువరకు వచ్చి విసుగ్గా వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు రామ్మూర్తి కొడుకు శేఖరం. రామ్మూర్తికి ఇవేమీ పట్టనట్లు మళ్ళీ పేపర్‌లో తల దాచుకున్నాడు.

లోన అత్తా కోడళ్ల మధ్య యుద్ధం జరుగుతుందని రామ్మూర్తికి తెలుసు. అది కోడలు ఈ గుమ్మం తొక్కిన మరుక్షణం నుంచే ప్రారంభమయింది.

"ఏమండీ విన్నారా? ఎంతేసి మాట లంటోందో!" శాంత ఏడుస్తూ రామ్మూర్తి దగ్గర కొచ్చింది.

రామ్మూర్తి పక్కనున్న చుట్టపీక నోట్లో పెట్టుకొని "శాంతా! కాస్త ఆ అగ్గిపెట్టి ఇలా పారెయ్యి!" అన్నాడు.

శాంత ఓ అడుగు ముందుకేసి ఆగి "అంతా నా ఖర్మ మీకీ విషయాలు పట్టవు. వాడు చూస్తే విని ఊరుకుంటాడు...." అంటుండగా

"ఊరుకోపోతే ఉరేసుకోమంటారా?" కోడలు అడ్డుతగిలింది.

శాంత రామ్మూర్తికి అగ్గిపెట్టె అందిస్తూ "అంతా ఆ శేఖరంగాడిలో వుంది. మన బంగారం మంచిది కానప్పుడు...."

అత్తామామల మాటలు వినిపించకుండా రేడియో సౌండ్ పెద్దగా పెట్టి కూర్చుంది కోడలు.

"పెళ్ళాం మాట విన్నవాడు గాడిదతో సమానమండీ. అది ఎలా చెబితే అలా ఆడితే వాడికీ గాడిదకీ తేడా ఏమిటి?" శాంత ఇంకా గొణుగుతూనే వుంది.

"ఇంతకీ ఏం చెయ్యమంటావు?" రామ్మూర్తి విసుగ్గా అన్నాడు.

"నా మాట విని...."

శాంత మాటకు అడ్డుతగిలి "నన్ను గాడిదని కమ్మంటావు" అన్నాడు రామ్మూర్తి.

"అలా అంటారేమిటండీ?"

"ఇప్పుడే అన్నావు కదా పెళ్ళాం మాట విన్నవాడు గాడిదని."

రామ్మూర్తి మాటలకు శాంత ముఖం చిన్నబోయింది. □

# కొండంత దీపం

పి. యస్. నారాయణ

వ్యాపారరీత్యా హైద్రాబాద్‌లో వారంరోజుల పని తగిలింది రామానికి. అటు యిటు తిరగాలి. బస్సులు టైంకు దొరకవు. ఆటో లంటే ఖర్చు యెక్కువ. అందుకే స్కూటరు తీసుకుని వెళితే హాయిగా వుంటుందనిపించి నల్లగొండ నించి ఉదయం ఎనిమిది గంటల కల్లా—బ్రీఫ్‌కేస్‌లో రెండుజతల గుడ్డలు పెట్టుకొని బయల్దేరాడు స్కూటర్ మీద రామం.

వాతావరణం చల్లగా వున్నది. ఆకాశానికి పట్టిన మబ్బులు సూర్యుణ్ణి కనబడనీయటం లేదు—ఎక్కడా ఆగకుండా వెళితే మూడు గంటల ప్రయాణం.

ఎలాగూ రామం పెద్దన్నయ్య హైద్రాబాద్ లోనే వున్నాడు. అక్కడ వుండవచ్చు.... వదిన యెప్పుడూ అంటూ వుంటుంది— శారదను తీసుకురాగూడదా అని....శారద బయలేరే....పిల్లలకు పరీక్షలవ్వటంతో యింట్లో వుండక తప్పలేదు....

ఇరవై నిముషాల్లోనే నార్కెట్‌పల్లికి వచ్చాడు రామం. అసలే చల్లటి వాతావరణం. ఆపైన రోడ్డు పక్కగా గుబురుగా పెరిగిన చింతచెట్లు.

నార్కెట్‌పల్లిలో ఆగి ఒక కప్పు చా త్రాగి రామ్‌ప్యారీ వేసుకొని ఫోర్ స్క్వేర్ ముట్టించి మళ్ళా స్కూటర్ ఎక్కాడు రామం. సీటు క్రిందగా బ్రీఫ్‌కేస్ వేలాడుతుంది-వెనుక శారద కూర్చుని కబుర్లు చెబుతుంటే—నడుం మీద చేయివేసి మరీ—యెంత బాగుండేది!

ఆలోచనలు భార్య శారద చుట్టూ తిరుగుతున్నాయి. రామం స్కూటర్‌ని విశాలమైన రోడ్డుమీద వేగంగా పోనిస్తున్నాడు. పైన మబ్బులు ఎవ్వరికీ అందగూడదన్నట్లుగా పరుగెడుతున్నాయి. రోడ్డుపక్కన $\frac{1}{5}$ రాళ్ళ గుట్టలు....పలచబడ్డ చెట్ల గుబుర్లు....

పడమటి గాలి ఈదురోమంటోంది. వాన వస్తే....గాలి మరింత ఎక్కువయితే తుఫానుగా మారితే....

రావటానికి వీల్లేదు....తెల్లటి మబ్బులు వానకు సూచన గాకపోవచ్చు....వీస్తున్న గాలి మబ్బుల్ని తరిమివేయవచ్చు....ఏదైనా ఇంకా రెండు—మూడు గంటలు తనవి కావు అనుకుంటే తను హైద్రాబాద్‌లో వుండిపోతాడు.

శారదను తీసుకురానందుకు వదిన విసుక్కుంటుంది.

కొండలాంటి గుట్ట... స్కూటరు ఎత్తు మీదకు ఎక్కుతుంది....కొండ మలుపు తిరిగితే పల్లం....ఆపైన ఓ గ్రామంగూడా వుండాలి. అక్కడ....బాగా ఎత్తుకు వచ్చేసింది స్కూటరు. మలుపు తిరిగింది.

ఓ ఆర్టీసీ సూపర్ ఎక్స్‌ప్రెస్ బస్సు రోడ్డు పక్కగా ఆగివున్నది. దాని పక్కన ప్రయాణీకు లంతా దిగి నిల్చొని వున్నారు.

యాక్సిడెంటా? .... ఈ మధ్య యాక్సిడెంట్స్ ఎక్కువవుతున్నాయి....

గేదె చచ్చిందో....మనిషి చచ్చాడో.... డ్రైవర్ ఉద్యోగమంత ప్రమాదకరమయిన ఉద్యోగం ఈ ప్రపంచంలో మరొకటి వుండదనిపించింది....అతడిది తప్పున్నా లేకపోయినా అతడంటే ఎవ్వరికీ జాలివుండదు....

బస్సు దగ్గరకు వచ్చి స్లో చేశాడు రామం: జనం దిగాలుబడి నిల్చొని వున్నారు.

"ఏమైంది?"

ఒక కుర్రవాడు నవ్వాడు...."మా అదృష్టం. దేనికీ పెట్టకముందే బ్రేకులు ఫెయిలయ్యాయని ఆపేశాడు డ్రయివర్ బాబు!" అన్నాడు.

పక్కకుతిప్పి ముందుకు వచ్చాడు రామం.

"ఎక్స్యూజ్ మీ...." ఓ ఆడగొంతు. కాలు

బ్రేకును నొక్కేసింది.

మెడ వెనక్కు తిప్పాడు.

ఓ అందమైన అమ్మాయి అతడివైపుకే చూస్తూ "మీరు హైద్రాబాద్ వెళుతున్నారా?" అన్నది.

జనం అప్పటికే న లు గు ర యి దు గు రు మూగారు స్కూటర్ చుట్టూ....

"అవును!"

"లిఫ్టు యివ్వగలరా?" ఆశగా అడిగింది.

ఒక్క క్షణం తడబడ్డాడు రామం. అందమయిన ఆడకూతురు అంత యిదిగా అడుగుతోంటే యెలా కాదనాలో అతడికి అర్థం కాలేదు....

"రండి!" చిన్నగా గొణుక్కొంటున్నట్లుగా అన్నాడు.

అక్కడ జనంలో నిశ్శబ్దం—ఆవిడ ధైర్యానికి వాళ్ళ నోళ్ళు పడిపోయినయ్యా అన్నట్లుగా.

"ఒక్క నిముషం....నా బ్యాగ్ తెచ్చుకుంటాను!" అంటూనే బస్సెక్కి—ఎయిర్ బ్యాగ్ తీసుకొని పరుగెత్తుకుంటూ వచ్చింది.

వెనక కూర్చుంటూ రామంకూ తనకూ మధ్యలో బ్యాగ్ పెట్టింది.

"థాంక్సండీ!"

"దట్సాల్ రైట్....అర్జంటుగా వెళ్ళాలా ఏఁవిటి?" అన్నాడు స్కూటర్ను ముందుకు దూకిస్తూ రామం.

"అవునండీ...రెండు గంటలకు ఇంటర్వ్యూ వున్నది....సరిగ్గా వెళ్ళివున్నట్లయితే ఈ బస్సు పదకొండు గంటలకు జేరివుండేది....అనుకోకుండా ఈ అవాంతరం వచ్చిపడింది ఇప్పుడు. డ్రైవర్ నార్కెట్‌పల్లి వెళ్ళి రిలీఫ్ తేవాలిట. ఎప్పుడు వెళతాడు....ఎప్పుడు తెస్తాడో ఆ భగవంతుడికే తెలియాలి....ఆ బస్సుకోసరం కూర్చుంటే అక్కడ యింటర్వ్యూ హుళక్కే!"

"దేనికి?"

"ఒక కంపెనీలో రిసెప్షనిస్టుగా!"

—నిజమే!....ఆ అమ్మాయి రిసెప్షనిస్టుగా చాలా బాగుంటుందనిపించింది రామానికి.

సన్నగా పొడుగ్గా పెద్దపెద్ద కళ్ళతో — చూచిన ఆ ఒక్కసారే— చెవులకు వూగుతున్న గాజుల్లాంటి రింగులు ఆ అమ్మాయి అందాన్ని మరింత పెంచినయి అనిపిస్తోంది.

తనది కారయితే యెంత బాగుండేది— పక్కనకూర్చోపెట్టుకొని ఆ అమ్మాయి మొఖంలోకి చూస్తూ డ్రైవ్ చేసేవాడు.

"మీరు ఒక్కరే బయల్దేరారు....ఒకరోజు ముందు బయల్దేరితే ఈ హడావుడి వుండేది కాదు గదా!"

"మొదటిద్దానికి సమాధానం ... ఒక్కదాన్నయినా నెగ్గుకురాగలననే ధైర్యం వున్నది. రెండోది....రెండు గంటలకుగదా యింటర్వ్యూ అని ఉదయాన్నే బయల్దేరాను .... మళ్ళీ ఇంటర్వ్యూ అవ్వగానే రాత్రికి బయల్దేరితే తెల్లవారేటప్పటికి మా ఇంట్లో వుండిపోతాను!" నవ్వినట్లే అనిపించింద.

పక్కనే వున్నా ఆ నవ్వుల్ని చూడలేని తానెంత దురదృష్టవంతుడో అనుకున్నాడు రామం.

"హైద్రాబాద్‌లో మీకు తెలిసిన వాళ్ళెవరూ లేరా?"

"ఉన్నారుగాని....వాళ్ళిళ్ళకు వెళ్ళటం నాకంత యిష్టముండదండీ!"

"పోనీయ్....హోటల్లోనైనా వుండవచ్చు గదా?" స్కూటర్ మ్రోతలో తన కంఠం తనకే వికృతంగా వున్నట్లనిపించింది.

ఫక్కున నవ్వింది ఆ అమ్మాయి "హోటల్ గదుల్లో ఒక్కదాన్నే వుండాలంటే చచ్చేభయం బాబూ...."

"అన్నట్లు మీ పేరు అడగనేలేదు. నా పేరు రామం!"

"సౌమ్య!"

"హౌ స్వీట్!"

"థాంక్యూ!"

జీవితంలో అందంగా హాయిగా ఆకాశ వీధుల్లో తిరగడం కంటే మించిన ఆనందం ఇంకెక్కడ వున్నది?....అందునా స్కూటర్ మీద వెనక కూర్చున్నది అందమైన అప్సరసే అయితే కావాల్సిందేఁ వున్నది... ఆ పైన ఆ అమ్మాయి భార్య గాకుండా మరో మనిషయితే ఇంకా చెప్పేదేఁవున్నది!





"దేఁవుడా! నీ కిదే నా కృతజ్ఞతలు!"

"మీరు....?!" ఆ అమ్మాయి అర్ధోక్తిలో ఆగినట్లుగా వున్నది.

"నేను బిజినెస్ మీద నల్లగొండ నుంచి హైద్రాబాద్ వెళుతున్నాను. ఒక వారం రోజులు పని....అటూ యిటూ తిరగడానికి వీలుగా వుంటుందని స్కూటర్ తీసుకొని బయల్దేరాను. నాకూ బంధువులు వున్నారుగాని వాళ్ళిళ్ళకు

వెళ్ళి స్వేచ్ఛను పోగొట్టుకొని మర్యాదల వడుమ బిగుసుకు కూర్చోవటం నా కిష్టంలేదు. స్వేచ్ఛగా హోటల్ గదుల్లో గడిపేస్తే జీవితాని కదో థ్రిల్లు—డబ్బు పోయినా!" గర్వంగా అన్నాడు.

"నిజం!" ఆ అమ్మాయీ నవ్వింది.

—అన్నీ వడ్డించిన విస్తరి ముందు చేతులు కట్టేసి కూర్చోబెట్టినట్లుగా వున్నది రామం పని....

రోడ్డుపక్కన తుప్పలు గిరగిరా తిరుగుతూ వెనక్కు వెళ్ళిపోతున్నాయి....ఎర్రని రాళ్ళ గుట్టలమీద గొర్రెల్ని కాస్తున్న కుర్రవాళ్ళు కర్రలు పట్టుకు పరుగెడుతున్నారు.

సౌమ్యను చూడాలి....

ఎలా?....

—అంత అందమయిన అమ్మాయిని ఎదురుగ్గా కూర్చోబెట్టుకొని కబుర్లు చెప్పుకుంటుంటే యెంత బాగుంటుంది?....

షడన్‌గా కాలితో—స్కూటరుకు అడ్డం వచ్చిన గొర్రెల్ని ఆసరాగా తీసుకొని—బ్రేక్‌ను నొక్కాడు....

సౌమ్య చటుక్కున అతడి బుజం పట్టుకొని వీపుకు అనుకుపోయింది.

అతడి కదే కావల్సింది.

"జాగ్రత్తండీ....వెధవ గొర్రెలు!"

"భయమేసిందండీ బాబోయ్.... తిన్నగా పోనీయండి!" వెనక్కు కూర్చుంటూ అన్నది సౌమ్య.

రామం నసుగుతున్నట్లుగా, "మీరు జాగ్రత్తగా కూర్చోండి!" అన్నాడు-మెడ పక్కకు తిప్పి....బుజంమీద చేయివేసిన ప్రదేశాన్ని ఆప్యాయంగా చూచుకుంటూ.

పక్కకు జరిగిన హ్యాండ్‌బాగ్‌ను సరిగ్గా పెడుతూ "హైవేస్‌మీద ప్రయాణం చేయటంలో ఇదే భయం...." అన్నది.

"మీరేం భయపడబోకండి. నేను ఐదేళ్ళ బట్టీ ఈ స్కూటర్‌ను నడుపుతున్నాను—యాక్సిడెంట్ ఫ్రీ!" అన్నాడు రామం ఆమెకు ధైర్యం చెబుతున్నట్లుగా.

పక్కగా లారి దూసుకుపోతోంటే రోడ్డు మీదనుంగి క్రిందకు దింపాడు స్కూటరును.

"మీరు ఉద్యోగం చేయాలని ఎందుకనుకుంటున్నారు?"

"అలా అనుకోవటం తప్పా?"

"అని గాదు....కారణం వుండాలి గదా.... మీకు వివాహం అయిందిగదా!" అది నిజమనే సంగతి అతడి ఉత్సాహంమీద చన్నీళ్ళు చల్లుతున్నా అన్నాడు.

"నా జీవితానికి పడ్డ వివాహమనే సంకెళ్ళను—విడాకులనే కత్తెర్లతో త్రుంచివేసే రోజులు చాలా దగ్గర్లోనే వున్నాయి!" చాలా బాధగా అన్నట్లనిపించింది.

"అదేం(విటి?" హఠాత్తుగా బ్రేకునొక్కుతూ అన్నాడు.

"నిజం అది!"

"ఎందుకని?"

"నాకు భర్త అయిన ఆ మొగమహారాజు నా కాలేజీ జీవితం గురించి ఏదో విన్నాడట.... అందుకని ఆయన నాతో సుఖంగా జీవితం వెళ్ళబుచ్చలేడట!" అన్నది దిగులుగా.

'ఎవ్వడా మొగమహారాజు....అంత అందమయిన సౌమ్యను కాదనే బలహీనత అతడికెలా కలిగింది? అలాంటి కధలు అందమయిన అమ్మాయిలకు లేకపోతే అమ్మమ్మలకుంటాయా!'

"సంకుచిత మనస్తత్వ మన్నమాట!" అన్నాడు—కవ్విస్తున్నట్లుగా.

క్రింది పెదిమను పంటితో నొక్కిపట్టి గట్టిగా సీటును పట్టుకు కూర్చున్నది సౌమ్య.

"దిగండి!" స్కూటర్ ఆపుతూ అన్నాడు రామం పక్కగా బస్‌స్టాపులో.


"దేనికి?"

"కాస్త యేదైనా డ్రింకు త్రాగి వెళ్దాం.... వేడి శరీరానికి చల్లని పానీయం యెంతైనా అవసరం!"

కూల్‌డ్రింక్స్ షాపు నుండి రెండు గోల్డు స్పాట్ తీసుకువచ్చాడు—స్కూటర్ దగ్గర నిల్చున్న సౌమ్య దగ్గరకు.

"యూ ఆర్ గివింగ్ ఎ గుడ్ కంపెనీ....





ఎ నైస్ డే ఫర్ మీ!" అన్నాడు కళ్ళలో మెరుపును చిందిస్తూ—ఆమె అందాన్నే సిప్ చేస్తున్నట్లుగా గోల్డు స్పాట్‌ను స్ట్రా ద్వారా సిప్ చేస్తూ.

"టు మీ ఆల్సో....థాంక్యూ!"

"మీరు హైద్రాబాద్‌లో ఎన్నాళ్ళుంటారు?" అన్నాడు ఆమె ముఖంలోకి చూస్తూ—రాత్రికే వెళ్తున్నానని వొకసారి చెప్పింది గుర్తున్నా.

"రాత్రికే వెళ్ళవచ్చు!"

"అంటే డిసైడ్ చేసుకోలేదా ఇంకా!"

—ఆకాశం మీద మబ్బులు క్రిందగా వస్తున్న గాలుల్ని చల్లబరుస్తున్నాయి—వాన వస్తుందా?

'సన్నటి తుప్పర పడితే బాగుండు!' అన్నట్లుగా ఒక్కసారి ఆకాశంలోకి చూశాడు రామం.

"అక్కడ ఇంటర్వ్యూనిబట్టి వుంటుంది!"

గోల్డుస్పాట్స్ అయిపోయాయి....రామం బాటిల్స్ తీసుకువెళ్ళి డబ్బులతోపాటు యిచ్చేసి వచ్చాడు.

స్కూటర్‌మీద కూర్చోబోతూ "ఆ బ్యాగ్ యిలా యివ్వండి....నా కాళ్ళదగ్గర పడేస్తాను!" అన్నాడు రామం—తమ మధ్య అదో పెద్ద కొండలా [illegible] ఫీలవుతూ....అది తీసేసిన తరువాత పోతుండగా రెండు జర్కులిస్తే అంత అందమయిన ఆడపిల్లా తనని బల్లిలా అంటుకుపోతుందనేది ఖాయం.

"థాంక్స్....అక్కర్లేదండీ!"

"ఫరవాలేదండీ....యివ్వండి!" అంటూనే—లాక్కుంటున్నట్లుగా తీసుకొని బ్రీఫ్‌కేస్‌తో పాటు తగిలించేశాడు. "నాకేం యిబ్బందిలేదు. అనవసరంగా యిరుక్కు కూర్చోవటం దేనికి? తరువాత సడన్ బ్రేక్ వేసినప్పుడు యెగిరి క్రింద పడితే రాబోయే ఉద్యోగం ఎలా వున్నా కాలో చేయో విరగటం మాత్రం ఖాయం!" నవ్వుతూ అన్నాడు.

"జీవితంలో అలా రాసిపెట్టివుంటే చేయగలిగిందేం వున్నది చెప్పండి!...." అన్నది నవ్వుతూ.

"సరే....అలా అయితే....ఇంకేదైనా అనుకోనిది జరిగిందే అనుకోండి—అప్పుడూ అలా జరగాల్సి వున్నది గాబట్టి జరిగింది అనుకుంటారా?" అన్నాడు రామం — తను సౌమ్యతో ఓ వారం రోజులు హోటల్లో ఒకే గదిలో గడిపేస్తే—ఆ అమ్మాయి అలా అను

కునే వూరుకుంటుందా?

—అలా అనుకొంటే యెంత బాగుంటుంది....?

"అఫ్‌కోర్స్....అన్నిటికీ అలా చెప్పుకోలేకపోవచ్చు....!" కలవర పడుతున్నట్లుగా అన్నది.

"మరి—" స్పీడెక్కించాడు రామం.

కళ్ళు తిప్పుతూ తనని కవ్విస్తున్న సౌమ్యను చూస్తుంటే ఇక్కడకు హైద్రాబాద్ ఒక జీవిత కాలం దూరం అయితే యెంత బాగుంటుంది అనుకొన్నాడు రామం!

"మీవారు యేం చేస్తుంటారు?" అన్నాడు మొఖం కాస్త వెనక్కి తిప్పి.

"గవర్నమెంట్ జాబ్!"

"ఐనీ....హైద్రాబాద్ మీరింతకు ముందు ఎప్పుడైనా వచ్చారా?"

"ఒకటి రెండుసార్లు వచ్చాను!"

"అన్నీ చూచారా?"

"లేదండీ!"

ఒక్క క్షణం మనస్సులో మాటల్ని కూడ గట్టుకుంటున్నట్లుగా ఆగాడు.

"నేనూనూ...." అతడు మాట్లాడుతున్నది అబద్ధమని అతడి కలవరపాటే చెబుతున్నది.

"నిజమా?"

"అవునండీ!"

"వారం రోజులు వుంటానంటుంటిరి గదా! ఇంకేం...."

"ఒక్కణ్ణే చూడాలంటే బోరండీ బాబు!"

"పోనీయ్....మీ శ్రీమతిని తీసుకురాలేకపోయారా!"

నిట్టూర్పు విడిచినట్లుగా మూలిగాడు రామం. గబగబా అబద్ధాల భవంతులకు పునాదులు వేయసాగాడు. "నాకు జీవితంలో కావాల్సినవన్నీ వున్నాయి....కావల్సినంత డబ్బు వున్నది. లేనిదల్లా ఒక్క సుఖమే. దాని ఆరోగ్యం ఏమీ బాగోదండీ. అసలు మంచంలో నుంచి లేవలేదు...."

"సారీ!"

"నా జీవితానికి మరొకరు విచారిస్తున్నారంటే నాకు చాలా బాధగా వుంటుంది!"

"దానితో ఉపశమనం గూడా కలగవచ్చు గదా!"

"నో!"

సౌమ్య మాట్లాడలేదు.

దూసుకొంటూ ఓ గడ్డి లారీ వెళ్ళిపోయింది.

"పోనీయ్....ఒక పని చేద్దామంటారా?"

"చెప్పండి!"

"మీరు యేమంటారో నని భయంగా వున్నది!"

"మనిషికి భయమే ఆయుక్షీణం—భయపడేదేమున్నదండీ. నా కిష్టమయితే 'ఊఁ' అంటాను. లేకపోతే సారీ అంటాను. నేను ఎమ్ ఎస్సీ చదివాను తెలుసా!"అన్నది సౌమ్య గర్వంగా.

"మీ మాటలు నాకు ధైర్యాన్ని కలిగిస్తున్నా పూర్తి భయాన్ని పోగొట్టటంలేదు...."

"ఏం ఫరవాలేదు చెప్పండి!"

"—ఎలాగూ మీకు జీవితంలో అంతగా సుఖం వున్నట్లు కనబడటంలేదు. నా సంగతి సరేసరి. మీ రేమీ అనుకోనంటే ఓ వారం రోజులు హైద్రాబాద్‌లో సరదాగా గడిపేద్దామా?"

ఎదురుగ్గా ఆవు దూడ అడ్డంపడి పరుగెత్తుకొచ్చేటప్పటికి సడన్‌గా బ్రేకు నొక్కాడు కాలితో. సౌమ్య ఊగిపోయి చటుక్కున అతడి నడుం పట్టుకొని, 'అమ్మో' అన్నది.

రామం స్కూటర్ని ఆపి పక్కకు తోశాడు. పక్కగా వంతెన, వంతెన పక్కగా చెట్లు, సగం ఎండిన చెరువు.


రామం కాళ్ళు రెండు క్రింద పెట్టి— నెర్వస్‌గా చూస్తూ, "పది నిముషాలు రెస్టు తీసుకుందామా?" అన్నాడు వెనుతిరిగి సౌమ్య మొఖంలోకి చూస్తూ.

"సరే....కానీయండి!" పలువరస తళుక్కుమనేలా నవ్వి, అతడి నడుంమీద నుండి చేయి తీసేసింది "యింటర్వ్యూ టైంకి జేర్చే బాధ్యత మీదే!"

"తప్పకుండా....జస్టు టెన్ మినిట్స్!"

యిద్దరూ రోడ్డు దిగి గడ్డి మీదగా నడిచి వంతెన పక్కగా చెట్ల క్రిందకు వెళ్ళారు. చల్ల






గాలి హాయిగా వున్నది....చెరువులో నుంచి ఒక్కసారిగా కొంగలన్నీ—కాగితాల్ని బరబరా చింపుతున్నట్లుగా మ్రోత చేస్తూ లేచాయి ఆకాశంలోకి.

"ఇక్కడ కాస్త బాగున్నది. కూర్చుందామా?" అన్నాడు రామం.

"అలాగే...."

ఇద్దరూ కూర్చున్నారు.

సౌమ్య రామం ఎదురుగా కూర్చున్నది ఎడంచేత్తో గడ్డిపీకుతూ. "మీకు హైద్రాబాద్ చూడాలని వున్నదా?" అన్నది అతడి మొఖంలోకి చూస్తూ.

రామం హుషారుగా ఓ చిల్లపెంకు తీసుకొని చెరువులో నీటిమీదకు విసిరాడు.

రోడ్డుమీద రెండు లారీలు పోటీ పడుతున్నట్లుగా ముందుకు పరుగెడుతున్నాయి.

"యస్ మేడమ్!"

"చూద్దామా మరి....మరి బిజినెస్ మీద వచ్చారు గదా....టైం స్పెండ్ చేయగలరా!" అన్నది గడ్డిని మునవేలిమీద ఆనించి చూస్తూ.

"విత్ ప్లజర్!" అన్నాడు రామం ఆనందంతో....అతడి గుండెలు సంతోషంతో యెగిరెగిరి పడుతున్నాయి.

ఎంత సుదినం ఈ రోజు?

ఎంత అదృష్టం తనది?

"వారం రోజులు వుంటావా సౌమ్యా నువ్వు. హోటల్లో వుందామా మరి?" గాలిలో తేలిపోతున్నట్లుగా లేస్తూ అడిగాడు.

"అబ్బే వారం రోజులెక్కడండీ. మీరు కాదూ కూడదూ అంటే రెండు రోజులు!" అన్నది మొఖం పక్కకు తిప్పుకుని తన్నూ లేస్తూ "వెళ్దామా....పెం[illegible] కాస్త రిఫ్రెష్ అయితేనేగాని యింటర్వ్యూకి వెళ్ళలేను మళ్ళా!"

"ఓ.కే వెళ్దాం .... ముందు వెళ్ళగానే హోటల్లో రూం తీసుకుందాం. ఓ గంట పడుకుందువుగాని స్నానం చేసి. ఆ పైన నువ్వు యింటర్వ్యూకి వెళ్ళవల్సిన కంపెనీకి వెళ్దాం. అవును..నాకు తెలిసిన ఒకళ్ళిద్దరు స్టేట్ గవర్నమెంటులో మంచి పొజిషన్లో వున్నారు. వాళ్ళ కెవరికైనా ఈ కంపెనీకి సంబంధించిన వాళ్ళు తెలుసేమో కనుక్కుంటాను!"

"థాంక్యూ!"

"వెళ్దామా!"

"ఓకే!"

"ఓకే!"

"మీరు దేవుడిలా కలిశారన్నమాట నాకు!"

"నో....నో....అంత గొప్పగా చెప్పుకో నక్కర్లేదు!" సిగ్గుపడుతున్నట్లుగా నవ్వాడు రామం.

మరల 'రంయ్' అంటూ స్కూటర్ బయ ల్దేరింది.

సన్నని తుప్పర పడుతోంది గాలిని పూర్తిగా చల్లబరుస్తూ.

"వాన వచ్చేలా వున్నదిగాని గట్టిగా పట్టుకు కూర్చో సౌమ్యా....స్పీడుగా వెళ్ళిపోదాం!" అన్నాడు రామం—తన నడుం మీద చేయివేసి పట్టుకోమన్నట్లుగా.

"పోనీయండి....ఫరవాలేదు....నాకు అలవాటే లెండి!"

స్కూటర్ స్పీడందుకుంది.

ద్రాక్షతోటలు హైద్రాబాద్ వచ్చేవారికి స్వాగత గీతాలు పలికేటందుకుగాను కట్టిన మామిడితోరణాల్లా కనబడుతున్నాయి.

'ఈ రెండురోజులూ తన స్వంత పనులకు పంగనామాలు పెట్టేయాలి!' అనుకున్నాడు హాయిగా రామం. "అంతగా అయితే ఇంకో రెండురోజులు యెక్కువ వుంటే సరిపోతుంది ఇక్కడ."

ఆలిండియా రేడియో వారి ట్రాన్స్మిటింగ్ టవర్స్ అంతపెద్ద పట్టణానికి కావలాదారుల్లా నిలబడివున్నాయి.

'విడిపోయేముందు జీవితాంతం జ్ఞాపకం వుండేలా—దాన్ని చూచినప్పుడల్లా ఈ మధుర క్షణాలే గుర్తుకువచ్చేలా-ఏదైనా ప్రజంటేషన్ యివ్వాలి సౌమ్యకు!'

మనుష్యుల కదలికలు ఎక్కువయినయి.... రిక్షాలు....ఆటోలు .... ఇంకాస్త ముందుకు వెళ్ళేటప్పటికి పొగలు గక్కే ఆర్టీసీ బస్సులు.

"హైద్రాబాద్ వచ్చేసింది సౌమ్యా!" హాయిగా అన్నాడు.

అతడి స్కూటర్ గాలిలో గజం ఎత్తున పోతోంది. దానిమీద అతడు పదడుగుల ఎత్తున మరీ కూర్చున్నాడు.

ఇక ఎంత హాయి! ఎంత హాయి!

సన్నని తుంపరపోయి చల్లని గాలే మిగిలింది.

సౌమ్య మాట్లాడలేదు.

మలక్‌పేట వచ్చేటప్పటికి రద్దీ యెక్కువయింది. బ్రేకు ఎక్కడ వేయాల్సివస్తుందో అన్నంత జాగ్రత్తగా వున్నాడు.

"జాగ్రత్త సౌమ్యా! గట్టిగా పట్టుకో!" ఆప్యాయంగా అన్నాడు.

"అలాగే."

స్లో చేస్తూ "ఏ హోటల్‌కు వెళ్దాం"అన్నాడు కాస్త వెనక్కు వంగి మెడ పక్కకు తిప్పుతూ మురిపెంగా.

"దేనికి వెళ్దామంటారు!" పెదాలు బిగించి చిన్నగా నవ్వింది.

"కాంటినెంటల్....న్యూ కాంటినెంటల్ తాజమహల్....న్యూ తాజమహల్ ....శ్రీదేవి సిద్ధార....ద్వారకా ....అయోధ్య....మధుర.... మహామాయా నీ యిష్టం ఏది కావాలో కోరుకో" అని చిన్నగా హుషారుగా అని, "పేరులో ఏమున్నది. మనకు ఏదైనా స్వర్గమే!" అన్నాడు నవ్వుతూ. బాదర్‌ఘాట్ బ్రిడ్జిని ఎండిపోయిన మూసీని చూచుకుంటూ దాటింది స్కూటర్.

"ఎటు పోనివ్వమంటావ్ చెప్పు అటువైపా యిటువైపా....ఎటువైపు!"అన్నాడు స్లో చేస్తూ ముందున్న మూడు రోడ్లవైపు చూస్తూ.

"ఒక్కక్షణం ఆపుదురా!"

"దేనికి."


"ప్లీజ్!"

"ఓకే!"

సౌమ్య స్కూటర్ మీద నుంచి దూకినట్లుగా దిగింది. కాస్త ముందుకు వంగి అతడి కాళ్ళ దగ్గరున్న హ్యాండ్‌బ్యాగును చటుక్కున చేతిలోకి తీసుకొని, "థాంక్యూ మిస్టర్ రామం. థాంక్స్ ఎలాట్!" అంటూనే—ఆమె చేస్తున్నదేమిటో అర్థంగాక బిత్తరపోయి—కోలుకుందేలోగానే పక్కన నిలబడివున్న ఖాళీ ఆటోలో కూర్చుని, "థాంక్యూసర్!" అంటూనే ఒకసారి ముత్యాలు వెదజల్లుతున్నట్లుగా హాయిగా నవ్వేసి "పోనీయ్!" అన్నది తల ఎగరేస్తూ, ఆటో, డ్రైవర్‌తో.

సౌమ్య అలా తల ఎగరవేసిన తీరు— మిస్టర్ రామం నీలాంటి వాళ్ళను ఇంతవరకూ లక్షమందిని చూచాను....నన్ను నేను ఎలా కాపాడుకోవాలో నాకు తెలుసు....దానికోసరం ఎన్ని కథలైనా చెప్పి మిమ్మల్ని డింకీలు కొట్టించగలదని గుర్తుంచుకో ఈ సౌమ్య— అన్నట్లుగా వున్నది!! □

# సిల్లీ



'రాజ్‌కుమార్ మెహ్రా'

"హాయ్ హాయ్! ఈ రోజాదివారం"అన్నాడు రావునాదం నిద్దట్లో పలవరిస్తున్నట్లు.

"అయితే ఈవేళ మనకు వంట పనిలేదన్న మాట. హాయ్........హాయ్........ఆదివారం" అన్నది పద్మావతి కాఫీ కప్పుతో మంచం పక్కనే నిలబడి.